సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+8 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 195

శనివారం 5-10-2024



'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'



బదిలీ జాబితాలో 179 మంది
విద్యుత్‌ శాఖలో ఉద్యోగుల బదిలీకి అప్పన్ల ప్రక్రియ ముగియగా లెక్క తేలింది. -2లో



నిశితంగా పరిశీలించాకే..
పూర్తిగా పరిశీలించాకే లేఔట్‌ అనుమతులు జారీచేయాలని అధికారులు సూచించారు. -2లో

SIMULTANEOUSLY PRINTED AT KHAMMAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

న్యూస్‌రీల్‌

నేడు మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్‌: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11గంటలకు ఖమ్మం చేరుకోనున్న ఆయన ఓ షాపింగ్‌ మాల్‌ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. ఆతర్వాత రాపర్తినగర్‌లోని విద్యానగర్, రఘునాథపాలెం మండలంలోని జీకే.బంజర, వీఆర్‌.బంజర, పాపటపల్లి, కోటపాడు, చిమ్మపూడిలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.

ఓపెన్‌ స్కూల్‌లో 31వరకు ప్రవేశాలు



ఖమ్మం సహకారనగర్‌: తెలంగాణ ఓపెన్‌ స్కూల్‌ సొసైటీ ద్వారా పదో తరగతి, ఇంటర్‌మీడియట్‌లో ప్రవేశాలకు ఈనెల 31వ తేదీ వరకు గడువు ఉందని డీఈఓ సోమ శేఖర శర్మ, ఓపెన్‌ స్కూల్‌ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్‌ మద్దినేని పాపారావు తెలిపారు. ప్రవేశాలకు కోసం ఓపెన్‌ స్కూల్‌ సెంటర్లలో లేదా 80084 03522 నంబర్‌తో పాటు www.telanganaopenschool.org వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రశాంతంగా సప్లిమెంటరీ పరీక్షలు

ఓపెన్‌ స్కూల్‌ పది, ఇంటర్మీడియట్‌ పరీక్షలు శుక్రవారం రెండో చేరాయి. పదో తరగతి పరీక్షకు 256మందిలో 222మంది, ఇంటర్‌ పరీక్షకు 83మందికి గాను 68మంది హాజరయ్యారని డీఈఓ తెలిపారు.

కొనసాగుతున్న సర్టిఫికెట్ల పరిశీలన



డీఈఓ కార్యాలయంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న డీఈఓ

ఖమ్మం సహకారనగర్‌: డీఎస్సీ–2024లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఖమ్మంలోని రోటరీనగర్‌ హైస్కూల్‌లో కొనసాగుతోంది. శుక్రవారం 329మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించగా ఇప్పటివరకు 1,075మంది అభ్యర్థులు హాజరయ్యారని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఇంకా 367మంది హాజరుకావాల్సి ఉందని వెల్లడించారు. కాగా, ఓ పక్క సర్టిఫికెట్లు పరిశీలిస్తూనే మరోవైపు అభ్యర్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. దసరా లోపే అభ్యర్థులకు పోస్టింగ్‌ ఆర్డర్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యాన ప్రక్రియలో వేగం పెంచారు.

సాగర్‌ కాల్వ యూటీ వద్ద పనులు పరిశీలన

కూసుమంచి: మండలంలోని పాలేరు సమీపాన సాగర్‌ ఎడమ కాల్వ యూటీ వద్ద జరుగుతున్న పనులను జల వనరుల శాఖ సీఈ విద్యాసాగర్‌ శుక్రవారం పరిశీలించారు. హట్యాతండా వద్ద కాల్వకు ఉన్న యూటీని పూర్తిగా తొలగించగా అక్కడ ఎలాంటి ముప్పు ఎదురుకాకుండా తగిన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. యూటీ తొలగించాక, కాలువ కట్టకు ఆవలి వైపు నిలిచిన నీటిని భారీ మోటార్ల ద్వారా తోడి కాల్వలోకి విడుదల చేస్తుండగా సీఈ పరిశీలించి సూచనలు చేశారు. ఎస్‌ఈ నర్సింగరావు, ఈఈ వెంకటేశ్వర్లు, డీఈఈలు మధు, మన్మథరావు, కాంట్రాక్టర్‌ ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 6లోపు ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు



ఖమ్మం సహకారనగర్‌: వరంగల్‌ – ఖమ్మం – నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి ఓటర్లుగా అర్హత కలిగిన వారు వచ్చే నెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్‌ డి.మధుసూదన్‌ నాయక్‌ ఒక ప్రకటనలో సూచించారు. ఫాం–19 ద్వారా ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని వెల్లడించారు. ఈ మేరకు నవంబర్‌ 23న ముసాయిదా జాబితా విడుదల చేసి, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం అనంతరం డిసెంబర్‌ 30న ఓటర్ల తుది జాబితా వెల్లడిస్తామని తెలిపారు. 2024 నవంబర్‌ 1కి ముందు ఆరేళ్లలో కనీసం మూడేళ్ల పాటు ఎస్‌జీటీకి తక్కువ స్థాయి కాకుండా బోధనలో నిమగ్నమైన ఉపాధ్యాయులు అర్హులని, సర్టిఫికెట్లను జత చేస్తూ ఫాం–19ను తహసీల్, ఆర్‌డీఓ కార్యాలయాల్లో సమర్పించవచ్చని వెల్లడించారు. అలాగే, ceotelangana.nic.in వెబ్‌సైట్‌ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని అదనపు కలెక్టర్‌ మధుసూదన్‌తెలిపారు.

మాఫీ ఫికర్..

జిల్లాలో రూ.2లక్షల లోపు పంట రుణాలు మాఫీ కాక వేల సంఖ్యలో రైతులు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ రకరకాల కారణాలతో మాఫీ కాక బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు అర్హుల వివరాలు గుర్తించేందుకు ఉద్యోగులు చేపట్టిన రైతు కుటుంబాల నిర్ధారణ ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లాలో 2023 డిసెంబర్‌ 31 నాటికి 3,73,157 మంది రైతులు రూ.4,307.58 కోట్లు పంట రుణాలు కలిగి ఉన్నారు. ఇందులో రూ.2 లక్షల లోపు రుణాలు కలిగిన రైతులకు మాఫీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్‌.. మూడు విడతల్లో రుణమాఫీ ప్రక్రియ చేపట్టింది. – సాక్షి ప్రతినిధి, ఖమ్మం



జిల్లాలో ఇంకా 55,869 మంది రైతుల ఎదురుచూపులు

- వివిధ కారణాలతో అర్హులైనా చేకూరని లబ్ధి
- కొనసాగుతున్న కుటుంబ నిర్ధారణ ప్రక్రియ
- బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న అన్నదాతలు

డీసీసీబీలోనే ఎక్కువ

మూడు విడతల్లో జిల్లాలోని 15 బ్యాంకులకు సంబంధించి 1,15,183 మంది రైతుల రుణాలు రూ.766,68,23,296ను ప్రభుత్వం మాఫీ చేసింది. ఏపీజీవీబీలో 35,466 మంది రైతులకు రూ.303,38,56,368, ఖమ్మం డీసీసీబీ నుంచి 46,958 మంది రైతులకు రూ.197,99,46,981 మాఫీ జరిగింది. ఎక్కువ మంది రైతులు ఈ రెండు బ్యాంకుల నుంచే రుణాలు తీసుకున్నారు. కాగా, రుణమాఫీ జరగని రైతుల సంఖ్య డీసీసీబీ పరిధిలోనే ఎక్కువగా ఉంది. జిల్లాలో మొత్తంగా మొదటి విడతలో 57,695 మంది, రెండో విడతలో 33,942 మంది, మూడో విడతలో 23,546 మంది రైతులకు రుణమాఫీ అయింది.

నత్తనడకన కుటుంబ నిర్ధారణ

రుణమాఫీ ప్రక్రియను రేషన్‌కార్డుల ఆధారంగా నిర్వహించడంతో కార్డులు లేని వారికి లబ్ధి జరగలేదు. దీంతో ప్రభుత్వం కుటుంబ నిర్ధారణ ప్రక్రియ చేపట్టింది. జిల్లాలో 55,869 రైతు కుటుంబాలకు గాను 40,250 కుటుంబాల వివరాలు సేకరించగా, ఇంకా 15,619 కుటుంబాలు మిగిలి ఉన్నాయి. ఇదంతా పూర్తయితే నిర్ధారించిన రైతు కుటుంబాలకు రుణమాఫీ జరిగే అవకాశం ఉంది. కాగా, బ్యాంకుల్లో రూ.3 లక్షల మేర పంట రుణాలు తీసుకున్న రైతులు కూడా ఉన్నారు. వీరు రూ.2లక్షలకు పైగా ఉన్న రుణం చెల్లిస్తే మిగతాది మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఆ మొత్తం చెల్లించాక మాఫీ అవుతుందా, లేదా అనే మీమాంస రైతులను వెంటాడుతోంది.



భూమి పంచాడని...

నేలకొండపల్లి మండలం అనంతనగర్‌కు చెందిన ఆనం వెంకటరెడ్డి రైతు రెండున్నర ఎకరాల భూమిపై నేలకొండపల్లి సొసైటీలో రూ.1.70 లక్షల పంట రుణం తీసుకున్నాడు. ఆయనకు మూడు విడతల్లో మాఫీ కాకపోగా అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. ప్రస్తుతం ఆ భూమిని కుమారులకు పంచడంతో పాస్‌పుస్తకాలు లేవని చూపుతుండడమే కారణమని చెబుతున్నామరు. సాగు కోసమే రుణం చేసినందున అధికారులు విచారించి మాఫీ చేయాలని వెంకటరెడ్డి కోరుతున్నారు.



పేరు తేడాతో దూరం

బోనకల్‌ మండలం ముష్టికుంట్లకు చెందిన బంధం వెంకటేశ్వర్లుకు బోనకల్‌లోని ఏపీజీవీబీ, ముష్టికుంట్ల పీఏసీఎస్‌ల్లో రూ.1.46 లక్షల రుణం తీసుకోగా మాఫీ కాలేదు. ఆయనకు రేషన్‌కార్డు సైతం ఉంది. ఇదే విషయంపై బ్యాంకులో ఆరా తీయగా.. రేషన్‌కార్డు, బ్యాంక్‌ రికార్డుల్లో పేర్లు తేడాగా ఉన్నాయని బదులిచ్చారు. ఇటీవల కుటుంబ నిర్ధారణలో తాను సైతం వివరాలు ఇచ్చానని చెబుతున్న వెంకటేశ్వర్లు రుణం ఎప్పుడు మాఫీ అవుతుందోనని ఎదురుచూస్తున్నాడు.

తప్పిదాలతో చిక్కులు

కుటుంబ సభ్యుల నిర్ధారణ కాకపోవడం, బ్యాంకర్ల తప్పిదాలతో చాలామంది రైతులు అర్హత ఉన్నా మాఫీకి నోచుకోలేదు. అలాగే ఆధార్‌ కార్డు, బ్యాంక్‌ ఖాతాలో ఉన్న పేర్లు సరిపోలకపోవడం మరో కారణంగా చెబుతున్నారు. ఒక కుటుంబంలో భార్య, భర్త, తండ్రి ఇలా అందరికీ కలిపి రూ.2 లక్షలకు మించి రుణం ఉండి.. వ్యక్తిగత ఖాతాల్లో రూ.2 లక్షల కన్నా తక్కువగా ఉన్నా మాఫీ కాలేదు. కేవలం ఆధార్‌ నంబర్‌ వివరాలు సరిపోలకపోవడంతోనే సుమారు 4 వేల మందికి రుణమాఫీ నిలిచిపోవడంతో ప్రభుత్వం కుటుంబ నిర్ధారణ చేపట్టింది.

జిల్లాలో పంట రుణాలు, మాఫీ అయిన రైతుల వివరాలు

రుణం తీసుకున్న రైతుల సంఖ్య	3,73,157
రుణం మొత్తం	రూ.4,307.58 కోట్లు
రుణమాఫీ అయిన రైతుల సంఖ్య	1,15,183
రుణమాఫీ మొత్తం	రూ.766.68 కోట్లు

ప్రక్రియ కొనసాగుతోంది..



రూ.2 లక్షల లోపు రుణ మాఫీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటివరకు జిల్లాలో 1.15 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల లోపు రుణమాఫీ అయింది. అయితే, అర్హత ఉన్నా మాఫీ కాలేదని రైతులు వస్తున్నారు. కుటుంబంలో తల్లి పేరుతో రుణం, కుమారుడి పేరుతో రుణం ఉండడం.. ఆధార్‌ నంబర్‌ మ్యాచ్‌ కాకపోవడం వంటి కారణాలతో దాదాపు 14 వేల ఖాతాలకు మాఫీ నిలిచిపోవడంతో ప్రభుత్వానికి వివరాలు సమర్పించాం. కుటుంబ సభ్యుల నిర్ధారణ పూర్తయితే ఫలితం ఉంటుంది. ఇక బ్యాంకులు పూర్తి వివరాలు పంపించకపోవడం వంటి కారణాలు ఉండగా.. డీసీసీబీలో ఈ సమస్య ఎక్కువగా ఉంది.

– ముజమ్మిల్‌ఖాన్, కలెక్టర్‌

స్వయంగా చూశా.. ఇక నాదే బాధ్యత



కిష్టారంలో ఇళ్లు దెబ్బతిన్న యజమానులతో మాట్లాడుతున్న కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్, ఎమ్మెల్యే రాగమయి

- బాధితులను కచ్చితంగా ఆదుకుంటాం..
- సింగరేణి ప్రభావిత ఇళ్లను పరిశీలించిన కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్, ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: దెబ్బతిన్న ఇళ్లు, సైలో బంకర్‌ ద్వారా వెలువడుతున్న కాలుష్యాన్ని స్వయంగా పరిశీలించినందున సమస్యల పరిష్కారం బాధ్యత తనదేనని కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌ భరోసా ఇచ్చారు. సత్తుపల్లి మండలం కిష్టారంలో సింగరేణి ఓసీతో ఎదురవుతున్న ఇబ్బందులపై ఫిర్యాదులు వెల్లువెత్తుతుండడంతో ఎమ్మెల్యే డాక్టర్‌ మట్టా రాగమయితో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. సైలోబంకర్‌ వల్ల కాలుష్యం పెరిగి ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి నెలకొందని, ఇటీవల కురిసిన వర్షాలతో అంబేద్కర్‌ కాలనీ నీట మునిగిందని స్థానికులు వివరించారు. కిష్టారం ఎస్సీ కాలనీలో బాంబు పేలుళ్లతో దెబ్బతిని కూలిపోతున్న ఇళ్లను పరిశీలించిన ఆయన ఆర్‌అండ్‌ఆర్‌ ప్యాకేజీపై ఎమ్మెల్యేతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అనంతరం కిష్టారం జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూములను త్యాగం చేసిన వారిని బాధ్యత తమపై ఉందన్నారు. ఈమేరకు డీపీఆర్‌ను పరిశీలించి త్వరలో కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. భవిష్యత్‌ తరాలకు అండగా నిలిచేలా కిష్టారం హైస్కూల్, ఆస్పత్రిని అద్భుతంగా తీర్చిదిద్దుమని వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే రాగమయి దయానంద్‌ మాట్లాడుతూ పదవి కంటే ప్రజలే తమకు ముఖ్యమని, ప్రజల తరపున చివరివరకు పోరాడుతామని తెలిపారు. సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం షాలేంరాజు, పీఓలు నర్సింహారావు, ప్రహ్లాద్, ఏఎంసీ చైర్మన్లు దోమ ఆనంద్‌బాబు, నీరజాదేవి, నాయకులు ఉడతనేని అప్పారావు, రావి నాగేశ్వరరావు, నరుకుళ్ల రవి, ములకలపాటి అప్పారావు, ధనుంజయ్, రామకృష్ణ పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన షాదీఖానా నిర్మాణం

కల్లూరు: కల్లూరులో షాదీఖానా నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌ తెలిపారు. కల్లూరులో షాదీఖానా పనులను ఎమ్మెల్యే రాగమయితో కలిసి పరిశీలించిన ఆయన పనులు ఆగడానికి కారణాలు, స్థల వివాదంపై ఆరా తీశారు. నిధులు సరిపడా ఉన్నందున రెండు, మూడు నెలల్లో పూర్తి చేస్తామని, కబరస్తాన్‌కు కూడా త్వరలో భూములు గుర్తిస్తామని తెలిపారు. ఆర్‌డీఓ ఎల్‌.రాజేందర్, తహసీల్దార్‌ సాంబశివుడు, ఎంపీడీఓ కె.చంద్రశేఖర్, డీఆర్‌డీఓ రాంసింగ్, పీఆర్‌ డీఈఈ రావిరాల రాంబాబు, ఏఎంసీ చైర్మన్‌ భాగం నీరజాదేవి, నాయకులు డాక్టర్‌ మట్టా దయానంద్, సదర్‌ సయ్యద్‌ అలీ, ఎండీ.హనీఫ్, ఎస్‌డీ.ఇషాక్, యాకూబ్‌ అలీ, తురాబల్లి, ఉస్మాన్, పసుమర్తి చందర్‌రావు, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, పెద్దబోయిన శ్రీను, లక్కినేని కృష్ణ, షేక్‌ బాజి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి వెళ్లాల్సిందే...

ఫ్యామిలీ డిజిటల్‌ కార్డు సర్వేపై ప్రత్యేకాధికారి



సర్వేపై ఆరా తీస్తున్న ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్, అదనపు కలెక్టర్‌ మధుసూదన్‌

రఘునాథపాలెం/కూసుమంచి: ప్రతీ ఇంటికి వెళ్లి సర్వే చేసి కుటుంబీకుల అందరి పేర్లను ఫ్యామిలీ డిజిటల్‌ కార్డు కోసం నమోదు చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్‌ సూచించారు. పెళ్లయి అత్తవారింటికి వెళ్లిన యువతులు, చనిపోయిన వారి తొలగింపు పక్కాగా జరగాలని తెలిపారు. రఘునాథపాలెం మండలంలోని రాములుతండాలో సర్వేను అదనపు కలెక్టర్‌ మధుసూదన్‌ నాయక్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మితో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. గతంలో ఉన్న జాబితా, ప్రస్తుతం సర్వేలో కుటుంబ వివరాలు తేడా వస్తున్నాయని చెప్పగా కుటుంబాల్లో కొత్తగా చేరిన సభ్యుల పేర్లు ప్రత్యేకంగానే నమోదు చేయాలని సూచించారు. మైనింగ్‌ ఏడీ సాయినాథ్, ఎంపీడీఓ అశోక్, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్లు స్వామి, లూథర్‌ బెన్నీ తదితరులు పాల్గొన్నారు. అలాగే, కూసుమంచి మండలంలోని ధర్మాతండాలో సర్వేను అదనపు కలెక్టర్‌ మధుసూదన్‌ నాయక్‌ పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కాగా, గ్రామంలో మొత్తం 145 కుటుంబాలను గుర్తించి సర్వే చేయగా.. ఇందులో 45 కొత్త కుటుంబాలు ఉన్నాయని ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు సర్వే పూర్తయిందని వెల్లడించారు.

ప్రజలకు చేరువగా సౌరవిద్యుత్‌

- సిరిపురంలో గృహ, వ్యవసాయ అవసరాలకు కనెక్షన్లు
- ఎన్పీడీసీఎల్‌ సీఎండీ వరుణ్‌రెడ్డి



సౌర ప్యానళ్ల ఏర్పాటుకు ఓ ఇంటి పైభాగాన పరిశీలిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి, అధికారులు

మధిర: సౌర విద్యుత్‌ వ్యవస్థను బలోపేతం చేసి ప్రజలకు చేరువ చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని టీజీ ఎన్పీడీసీఎల్‌ సీఎండీ కె.వరుణ్‌రెడ్డి తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గంలోని సిరిపురం గ్రామానికి పైలట్‌ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేయగావిద్యుత్‌శాఖ అధికారులతో సీఎండీ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులకు సౌర విద్యుత్‌పై అవగాహన కల్పిస్తూ వారి అభిప్రాయాలు సేకరించారు. గ్రామంలో దాదాపు 1,039 గృహ కనెక్షన్లు, 520 వ్యవసాయ కనెక్షన్లు ఉండగా విద్యుత్‌ శాఖ, రెడ్కో ఆధ్వర్యాన సర్వే చేపట్టామని తెలిపారు.

వినియోగదారులపై భారం పడకుండా..

క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం సిరిపురంలోని రైతు వేదికలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ వినియోగదారులపై ఆర్థిక భారం పడకుండా ఈ ప్రాజెక్టు చేపడుతున్నామని తెలిపారు. ఉత్పత్తి అయ్యే సోలార్‌ విద్యుత్‌ను సొంత అవసరాలకు వినియోగించుకున్నాక మిగిలిన విద్యుత్‌ను డిస్కంకు సరఫరా చేస్తే ఆదాయం పొందొచ్చని చెప్పారు. కాగా, సౌర ప్యానెళ్ల ఏర్పాటుకు అనుకూలంగా లేని 201 ఇళ్ల వద్ద ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని రెడ్కో అధికారులకు సూచించారు. ఇక రైతులు కొందరు చొప్పున ఒకేచోట ప్యానెళ్లు ఏర్పాటు చేసుకుంటే ఫలితం ఉంటుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పునరుత్పాదక శక్తిని ప్రోత్సహించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం, లబ్ధిదారులకు ఆదాయం సమకూర్చడమే ఈ ప్రాజెక్టు ఉద్దేశమని సీఎండీ వివరించారు. పైలట్‌ ప్రాజెక్ట్‌ కింద ఎంపికైన సిరిపురం వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీఎండీ వెంట రెడ్కో వైస్‌ చైర్మన్, మేనేజింగ్‌ డైరెక్టర్‌ వి.అనీల, జీఎం మేనేజర్‌ సత్యవరప్రసాద్, ఎన్పీడీసీఎల్‌ జీఎం(ఐపీసీ) మల్లికార్జున్‌రావు, డీఈ(ఐపీసీ) అమర్‌నాథ్, ఖమ్మం ఎస్‌ఈ ఏ.సురేందర్‌తో పాటు వివిధ డివిజన్ల అధికారులు హీరాలాల్, అనురాధ, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తుల బదిలీ, నియామకం

ఖమ్మం లీగల్‌: జిల్లాకు పలువురు న్యాయమూర్తులను కేటాయించారు. ప్రస్తుతం సీనియర్‌ సివిల్‌ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న కే.వీ.చంద్రశేఖర్‌రావును ఖమ్మం న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా నియమించారు. అలాగే, ఖమ్మం ఒకటో అదనపు సీనియర్‌ సివిల్‌ జడ్జిగా ఉన్న ఎం.కల్పన ప్రధాన సీనియర్‌ సివిల్‌ జడ్జిగా నియమితులయ్యారు. అంతేకాక ఖమ్మం ఒకటో అదనపు సీనియర్‌ సివిల్‌ జడ్జిగా టి. శివరజినిని నియమించారు. ఆమె ప్రస్తుతం సిద్దిపేటలో ప్రిన్సిపల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్‌ జనరల్‌ నుంచి శుక్రవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి.

జిల్లా కోర్టులో బతుకమ్మ వేడుకలు



బతుకమ్మల వద్ద పూజలు చేస్తున్న జిల్లా జడ్జి రాజగోపాల్‌

ఖమ్మం లీగల్‌: జిల్లా కోర్టు ఆవరణలో బార్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యాన శుక్రవారం బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్‌ దంపతులు పాల్గొని బతుకమ్మకు పూజలు చేశారు. అనంతరం జిల్లా జడ్జి మాట్లాడుతూ పూలను పూజించే సంస్కృతి ఎంతో గొప్పదని.. ఈ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందని తెలిపారు. అనంతరం మహిళా న్యాయవాదులు బతుకమ్మల చుట్టూ ఆడిపాడారు. న్యాయమూర్తులు అపర్ణ, శాంతిలత, మాధవి, బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్‌తో పాటు చింతనిప్పు వెంకట్, లలిత, ఎం.శ్రీనివాస్, వై.శ్రీనివాస్, మలీదు నాగేశ్వరరావు, వెంకటగుప్తా, వెంకటలక్ష్మి, జాలావతి, విజయ, శ్రీలక్ష్మి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

బాలాత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు



బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా శ్రీవారికి తెల్లవారుజామున పంచామృతంతో అభిషేకం నిర్వహించగా, యాగశాలలో ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, అర్చకులు గణపతి హోమం తదితర పూజలు చేశారు. ఆతర్వాత అలివేలుమంగ అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించడంతో పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. హైకోర్టు న్యాయవాది చీదెళ్ల వెంకటరామన్‌ దంపతులు పద్మావతి అమ్మవారికి ముత్యాల కవచం బహుకరించారు. ఆలయ ఈఓ. కె.జగన్మోహన్‌రావు, చైర్మన్‌ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ముఖ్య అర్చకులు మురళీమోహన్‌శర్మ, సూపరింటెండెంట్‌ విజయకుమారి పాల్గొన్నారు.

మున్నేటిలో ఫ్యాక్టరీల వ్యర్థాలు

- హైదరాబాద్‌ నుంచి తీసుకొచ్చి కలుపుతున్న వైనం
- ట్యాంకర్లను గుర్తించి అడ్డుకున్న స్థానికులు
- తాగునీరు కలుషితం అవుతోందని ఆందోళన



పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ట్యాంకర్‌ (ఇన్‌సెట్‌) ట్యాంకర్‌ నుండి కింద పడిన వ్యర్థాలు

ఖమ్మంరూరల్‌: ఖమ్మం నగరంలోని ధంసలాపురం, ప్రకాష్‌నగర్, త్రీటౌన్‌లోని పలు ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేసే మున్నేటిలో ఫ్యాక్టరీల వ్యర్థాలను కలుపుతున్నారు. ఖమ్మంరూరల్‌ మండలంలోని వెంకటగిరి, కోటనారాయణపురం, గుదిమళ్ల ప్రాంతాల్లో విష వ్యర్థాలు వదిలేస్తుండగా తాగునీరు కలుషితమవుతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. హైదరాబాద్‌లోని వివిధ ఫ్యాక్టరీల నుండి వెలువడిన విష వ్యర్థాలను ట్యాంకర్ల ద్వారా తీసుకొచ్చి వెంకటగిరి సమీపాన మున్నేటిలో వదులుతున్నట్లు సమాచారం. ఆగస్టు 15వ తేదీన హైదరాబాద్‌ నుండి ట్యాంకర్‌తో వచ్చిన పలువురు వ్యర్థాలు వదిలి వెళ్తుండగా వెంకటగగిరి, గుదిమళ్ల గ్రామస్తులు పట్టుకున్నారు. ఆపై పోలీసులకు ఫిర్యాదు చేసినా తూతూమంత్రంగా విచారించి వదిలేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

తెల్లవారుజామునే...

గతంలో పలుమార్లు ట్యాంకర్లను స్థానికులు అడ్డుకున్నా యజమానులు తీరు మార్చుకోకపోగా పోలీసులు సైతం పెద్దగా పట్టించుకోలేదు. దీంతో శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని ఓ ఫ్యాక్టరీ నుండి ట్యాంకర్‌లో విష వ్యర్థాలను తీసుకొచ్చి వెంకటగిరి వద్ద మున్నేటిలో కలుపుతుండగా గ్రామస్తులు గుర్తించారు. వారు ఇచ్చిన సమాచారంతో పోలీసులు చేరుకుని ట్యాంకర్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేయగా గ్రామస్తులు మాత్రం కలెక్టరేట్‌కు తరలించాలని పట్టుబట్టారు. గతంలోనూ పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి వదిలేశారని ఆరోపించడంతో పోలీసులు నచ్చచెప్పి ట్యాంకర్‌ను రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. కాగా, మున్నేటిలో వదిలిన విష వ్యర్థాలు నీటిలో కలిసి చింతకాని, బోనకల్, మధిరతో పాటు ఆంధ్రా ప్రాంతం వరకు వ్యాపిస్తున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా తాగునీరు కలుషితం అవుతుండగా పశువులు, పంటపొలాలకు ముప్పు ఉంటుందని చెబుతున్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు గుదిమళ్ల వద్ద మున్నేటిలో ఫ్యాక్టరీల నుంచి వెలువడే విష వ్యర్థాలను కలిపిన ఘటనపై శుక్రవారం ఖమ్మం రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌లో కేసు నమోదైంది. హైదరాబాద్‌లోని ఓ ఫ్యాక్టరీ యజమాని మధుసూదన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్‌కు చెందిన డ్రైవర్‌ కృష్ణ ట్యాంకర్‌తో వచ్చి మున్నేటిలో వ్యర్థాలు వదులుతుండగా చేపలు పట్టడంలో నిమగ్నమైన గుదిమళ్లకు చెందిన కందరబోయిన శ్రీనివాస్, గుమ్మం గోపయ్య గుర్తించారు. వీరు ఇచ్చిన సమాచారంతో గ్రామస్తులు ధరావత్‌ నాగేశ్వరరావు, తదితరులు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మధుసూదన్‌రెడ్డి, కృష్ణపై కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

క్లుప్తంగా

'సామాజిక - ఆర్థిక ముఖచిత్రం' పుస్తకాల విక్రయం


పుస్తకాలు

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వం విడుదల చేసిన 'తెలంగాణ సామాజిక, ఆర్థిక ముఖచిత్రం - 2024' పుస్తకాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయని సీపీఓ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఒక్కో పుస్తకం ధర రూ.150కాగా, జిల్లాకు 400 పుస్తకాలను కేటాయించారని పేర్కొన్నారు. అవసరమైన వారు కలెక్టరేట్‌లోని చీఫ్ ప్లానింగ్ కార్యాలయం(ఎఫ్-27)లో పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

ఎస్‌జీటీ, ఎస్‌ఏ పోస్టులకు 62 మంది అర్హత

ఖమ్మంమయూరిసెంటర్: బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యాన బీసీ స్టడీ సర్కిల్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన 259 మంది శిక్షణ పొందగా, వీరిలో 62 మంది 2024 డీఎస్సీకి ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్లుగా అర్హత సాధించారని స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత తెలిపారు. ఇందులో బొడ్డుపల్లి పెద్దిరాజు మొదటి ర్యాంకు, మేకల సందీప్ నాలుగు, మీసాల యామిని, ఖాతారపు నాగ భూషణం ఐదు, పాలెపు నాగేశ్వరరావు, ఎనుముల నరేశ్ ఆరు, చిల్లపల్లి రాధాకృష్ణ ఏడు, ఉదారపు సత్యనారాయణ 11, దేశగాని వీరన్న 12, మునిగంటి లక్ష్మీకుమార్ 13వ ర్యాంక్ సాధించారని వెల్లడించారు. ఈ సందర్భంగా అభ్యర్థులను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, డీబీసీడీఓ జి.జ్యోతితో పాటు డైరెక్టర్ శ్రీలత అభినందించారు.

సిరిసిల్ల మత్స్యకారులకు శిక్షణ


మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త శ్యాంప్రసాద్

కూసుమంచి: సిరిసిల్ల జిల్లాలోని మత్స్య సహకార సంఘాల సభ్యులకు మూడు రోజుల పాటు ఇవ్వనున్న శిక్షణ మండలంలోని పాలేరు శ్రీ పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో శుక్రవారం ప్రారంభమైంది. ఈసందర్భంగా పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ మత్స్యకారులు శిక్షణను సద్వినియోగం చేసుకుని చేపల దిగుబడి పెంచగలిగితే ఆర్థికాభివృద్ధి సాధించొచ్చని తెలిపారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఆక్వా రంగాన్ని అగ్రగామిగా నిలపాలన్నారు. శాస్త్రవేత్త రవీందర్ తదితరులు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం జిల్లాస్థాయి అండర్-14, 16, 18, 20 బాలబాలికల జట్ల ఎంపికకు పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 80మంది అథ్లెట్లు హాజరుకాగా, డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, సీనియర్ కోచ్ ఎం.డీ.గౌస్ పర్యవేక్షించారు. కాగా, అండర్-14 బాలుర జట్టుకు ఎస్.విఘ్నేష్, వి.చరణ్‌గౌడ్, డి.అనిల్‌కుమార్ నాయక్, విజయ్ రామకృష్ణ, బాలికల విభాగంలో పి.కీర్తి, జి.మంజుని, బి.దీక్ష, కె.హస్మిత, అండర్-16 బాలురలో బి.లోకేష్, ఎస్.కే. ముబీన్, వి.సాయి, బాలికల్లో బి.వైష్ణవి, మనుశ్రీ, బి.రూప, బి.కృష్ణవేణి, అండర్-18 బాలురలో ఏ.వీరేందర్, జె.అనిల్, అక్సర్, బాలికలలో డి.బింధు, టి.వెన్నెల, ఎస్.కే.ఆఫ్రిన్ ఎంపికయ్యారు. అలాగే, అండర్-20 బాలురలో పి.షారుఖ్, ఎస్.కే.ఆఫ్తాబ్, డి.వివేక్‌చంద్ర, బాలికలలో మనీషా, జెనవ్య, అనూష ఎంపికయ్యారని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్ వెల్లడించారు.

ఇసుక తరలింపును అడ్డుకున్న యువత

నేలకొండపల్లి: ఇటీవల వరదలు కొంత మందికి శాపం కాగా.. ఇసుక ఫియాకు మాత్రం వరంగా మారాయి. భారీ వర్షాలు, వరదతో ఇసుక మేటలు వేయగా అక్రమతంగా తరలించే వారిని అడ్డుకున్న ఘటన ఇది. మండలంలోని చెన్నారం - సుర్దేపల్లి ఏటి పరివాహక ప్రాంతం నుంచి కొందరు ప్రతీ రోజు భారీ మొత్తంలో ఇసుక తరలిస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంతో శుక్రవారం చెన్నారానికి చెందిన యువకులు వెళ్లి త్వరలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కానున్నందున స్థానిక అవసరాలకు ఇసుక అవసరమవుతుందని అడ్డుకున్నారు. ఈనేపథ్యాన వ్యాపారస్తులు యువకులను అసభ్య పదజాలంతో దూషించినట్లు తెలుస్తుండగా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఇసుక వదిలేసి వెళ్లిపోయారు. కాగా, ఘటనపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,043

బదిలీ జాబితాలో 179 మంది..

- విద్యుత్ ఉద్యోగులకు ముగిసిన ఆప్షన్ల ప్రక్రియ
- ఈనెల 7న ఉత్తర్వులు జారీ
- అడ్డదారులు తొక్కుతున్న కొందరు?



ఖమ్మంవ్యవసాయం: ఎన్పీడీసీఎల్ ఖమ్మం సర్కిల్ పరిధిలో వివిధ కేడర్లకు 179 మంది ఉద్యోగులు బదిలీ జాబితాలో ఉన్నారు. కార్పొరేట్ కార్యాలయం, ఖమ్మం విద్యుత్ సర్కిల్, డివిజన్ల స్థాయిలో ఇంజనీర్లు, అధికారులు, ఉద్యోగులు, కార్మికుల బదిలీల ప్రక్రియ మొదలుపెట్టగా ప్రస్తుత స్థానంలో రెండేళ్ల సర్వీసు పూర్తయిన వారితో జాబితాలు రూపొందించారు. ఆపై ఆప్షన్లను ఇచ్చుకునే అవకాశాన్ని కల్పించారు. ఇంజనీర్లు, అకౌంట్స్ అధికారులు వెబ్‌సైట్‌లో ఆప్షన్లను ఇచ్చుకునే అవకాశం కల్పించగా, డివిజన్ స్థాయి ఉద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. శుక్రవారంతో ఈ ప్రక్రియ పూర్తికాగా, నిబంధనల మేరకు అర్హులైన వారికి ఈనెల 7వ తేదీన బదిలీ ఉత్తర్వులు జారీ చేయనున్నారు.

యూనియన్ ప్రతినిధుల హవా

కొందరు ఉద్యోగులు మంచి పోస్టింగ్ కోసం అడ్డదారులు తొక్కుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. యూనియన్ల ప్రతినిధులకు బదిలీల్లో ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో ఇంజనీర్ల కేడర్ మొదలు అధికారులు, కార్మికుల వరకు కొందరు యూనియన్ ప్రతినిధులుగా అవతారం ఎత్తి ఇష్టమైన పోస్టింగ్ కోసం ఆప్షన్లు ఇచ్చుకున్నట్లు శాఖలో చర్చ జరుగుతోంది. యూనియన్ డైరీల్లో ప్రతినిధులుగా లేనివారు ప్రస్తుత బదిలీల్లో ప్రతినిధులుగా నమోదు చేసుకున్నట్లు సమాచారం. ఇదిలాగే కొనసాగితే ఏళ్ల తరబడి మారుమూల ప్రాంతాల్లో ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న తమకు అన్యాయం జరుగుతుందని కొందరు చెబుతున్నారు. యూనియన్ ప్రతినిధుల పేరిట కొందరు మాత్రం జిల్లా కేంద్రంలోనే ఉంటారని ఆరోపిస్తున్నారు.

సీఎండీని కలిసిన యూనియన్ ప్రతినిధులు

సౌర విద్యుత్ గ్రామంగా ఎంపికైన మధిర నియోజకవర్గం సిరిపురానికి శుక్రవారం వచ్చిన వరంగల్ ఎన్పీడీసీఎల్ వరుణ్‌రెడ్డి గ్రామ పర్యటన అనంతరం ఖమ్మం విద్యుత్ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం(327) జిల్లా అధ్యక్షుడు మందపాటి సత్యనారాయణరెడ్డి, నాయకులు సీఎండీని కలిసి బదిలీల్లో ఆప్షన్ల విధానంలో మార్పులు తీసుకురావాలని, యూనియన్ ప్రతినిధులతో సంప్రదించి బదిలీలు నిర్వహించాలని కోరారు. అలాగే, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(1104) ప్రతినిధి తక్కెళ్లపల్లి శేషగిరిరావు తదితరులు కూడా బదిలీ విధానంలో లోపాలు ఉన్నాయని వినతిపత్రం అందించారు.

కేడర్ల వారీగా బదిలీ కానున్న ఉద్యోగుల వివరాలు

కేడర్	ఉద్యోగుల సంఖ్య		
డివిజనల్ ఇంజనీర్ అసిస్టెంట్	01	సీనియర్ అసిస్టెంట్లు	22
డివిజనల్ ఇంజనీర్లు	10	జూనియర్ అసిస్టెంట్లు	08
ఏఈఈలు	42	రికార్డ్ అసిస్టెంట్లు	03
సబ్ ఇంజనీర్లు	28	ఆఫీస్ సబార్డినేట్లు	11
ఎస్‌ఏఓలు	01	ఫోర్‌మెన్లు	08
ఏఏఓలు	03	సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్లు	16
జేఏఓలు	21	ఎస్‌జీఎస్‌ఓ	03
		వాచ్‌మెన్లు	02
		మొత్తం	179



ఖాతాదారుల నమ్మకంతోనే పురోగతి

భద్రాద్రి బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి


చైర్మన్ కృష్ణమూర్తిని సత్కరిస్తున్న పాలకవర్గ ప్రతినిధులు, అధికారులు

ఖమ్మంగాంధీచౌక్: ఖాతాదారుల నమ్మకంతోనే బ్యాంక్ పురోభివృద్ధి జరుగుతోందని భద్రాద్రి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి తెలిపారు. ఖమ్మం గాంధీచౌక్‌లో బ్యాంక్ 28వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించగా చైర్మన్ మాట్లాడారు. ఖాతాదారులకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా రిజర్వ్ బ్యాంక్ ప్రథమ శ్రేణి బ్యాంకుగా గుర్తింపునిచ్చిందని తెలిపారు. ప్రస్తుతం 17 బ్రాంచ్‌లతో రూ. 950 కోట్ల టర్నోవర్‌తో కొనసాగుతుండగా, ఆకర్షణీయమైన వడ్డీరేట్లు, వివిధ రకాల రుణ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఖమ్మం, మహబూబాబాద్, కొత్తగూడెం, వరంగల్, కరీంనగర్, సూర్యాపేట జిల్లాలో బ్యాంకు శాఖలు ఉండగా, త్వరలోనే మరో ఐదు జిల్లాలకు విస్తరించేందుకు కృషి జరుగుతోందని తెలిపారు. బ్యాంక్ సీఈఓ దాసరి వేణుగోపాల్, వైస్ చైర్మన్లు ఉదయ్‌ప్రతాప్, వేములపల్లి వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు బలుసు సాంబమూర్తి, దేవత రాజారావు, కె.నర్మద, జయప్రద, మద్ది పిచ్చయ్య, పి.శిల, రేఖల భాస్కర్‌రావు, అధికారులు ఎల్‌వీఎస్.ప్రసాద్, శ్యామ్, రామారావు, సత్యనారాయణ, నర్సింగరావు పాల్గొగా చైర్మన్‌ను సన్మానించారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి దాతల చేయూత

సాక్షి ఎఫెక్ట్..


శ్రీహర్షితకు చెక్కు అందజేస్తున్న వెంకటేశ్వర్లు, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

వైరా/ఖమ్మం సహకారనగర్: నిరుపేద కుటుంబంలో జన్మించిన పానెం శ్రీహర్షిత వనపర్తి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించగా కళాశాల, హాస్టల్ ఫీజుతో పాటు ఇతర ఖర్చులకు నగదు లేక ఇబ్బంది పడుతున్న అంశంపై ఈనెల 3న 'చదువుల తల్లిని కనికరించని లక్ష్మీదేవి' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో పలువురు దాతలు ఆమెకు ఆర్థికసాయం అందజేస్తున్నారు. ఖమ్మంలోని హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యురాలు, ఖమ్మం రిక్కాబజార్ హైస్కూల్ ఉపాధ్యాయురాలు మల్సూరి సైదారాణి శుక్రవారం శ్రీహర్షితకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు చెక్కును పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు ఖమ్మంలో అందించగా హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు, పీఆర్‌టీయూ నాయకులు రాయల నర్సింహారావు, శ్రీధర్‌బాబు, విజయ, అమృతకుమార్, రమేష్, సుబ్బారావు, కృష్ణయ్య, పూర్ణచంద్రరావు, రవికిరణ్, గోవర్ధన్‌రెడ్డి, పాటి రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే, బోనకల్ మండలానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మరో రూ.10 వేలు నగదును గ్రామానికి వెళ్లి ఆమెకు అందించారు. అంతేకాకుండా వైరాలోని బొర్రా యూత్ వాట్సప్ గ్రూప్ సభ్యులు నగదు జమ చేసే పనిలో నిమగ్నమయ్యారు.

సింగరేణి భాగస్వామ్యం వద్దు..


నిరసన తెలుపుతున్న టీజీపీఈ జేఏసీ ప్రతినిధులు, ఉద్యోగులు

ఖమ్మంవ్యవసాయం: రామగుండంలో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పవర్ ప్లాంట్‌ను సింగరేణి సంయుక్త భాగస్వామ్యంతో కాకుండా జెన్‌కో నేతృత్వంలోనే నిర్మించాలని విద్యుత్ టీజీపీఈ(తెలంగాణ పవర్ ఎంప్లాయిస్) జేఏసీ నాయకులు కోరారు. ఈమేరకు శుక్రవారం ఖమ్మం ఎన్పీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. నిపుణులైన ఇంజనీర్లు, ఉద్యోగులు ఉన్నందున ప్లాంట్ నిర్మాణం జెన్‌కో నేతృత్వాన చేపట్టాలన్నారు. జేఏసీ బాధ్యులు, ఉద్యోగులు నాగమల్లేశ్వరరావు, మందడపు సత్యనారాయణరెడ్డి, ఎం.ప్రసాద్, సీతారాం గోపాల్, పుష్పరాణి, వల్లాల యుగంధర్, గంట శ్రీనివాసరావు, ఎల్వీ.కృష్ణారావు, ఆర్.నాగేంద్రకుమార్, ఫణికుమార్ తదితరులు పాల్గన్నారు.

జిల్లాతో 'నూకల'కు అనుబంధం...

ఖమ్మంవన్‌టౌన్: హృదయ సంబంధిత అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం కన్నుమూసిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నూకల నరేష్‌రెడ్డికి ఖమ్మం జిల్లాతో ఎనలేని అనుబంధం ఉంది. అప్పగించిన పనిని తూ.చా. తప్పకుండా నిర్వర్తించే ఆయన గతంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. అప్పట్లో కేసీఆర్ ఆయనను ఖమ్మం జిల్లా పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా నియమించగా పలు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి పాటుపడ్డారు. కాగా, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానం మేరకు నరేష్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం తన సమీప బంధువు రామసహాయం రఘురాంరెడ్డి ఖమ్మం ఎంపీగా పోటీచేయగా ప్రచారంలో కీలకంగా వ్యవహరించారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన నరేష్‌రెడ్డి ఖమ్మం జిల్లాలోని వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులతో సత్సంబంధాలు ఉన్నాయి. ఆయన మృతిపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, రాష్ట్ర గిడ్డంగులు, నీటిపారుదల అభివృద్ధి సంస్థల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయ్‌బాబు తదితరులు సంతాపం ప్రకటించారు.

నిశితంగా పరిశీలించాకే అనుమతులు


దరఖాస్తులను పరిశీలిస్తున్న కమిషనర్, అదనపు కలెక్టర్

ఖమ్మంమయూరిసెంటర్: లేఔట్ల దరఖాస్తులను అన్నివిధాలుగా పరిశీలించాకే అనుమతులు జారీ చేయాల్సి ఉంటుందని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ శ్రీజ తెలిపారు.ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి లేఔట్ కమిటీ సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా కమిటీ ఆమోదానికి వచ్చిన 13 దరఖాస్తులను పరిశీలించాక ఉద్యోగులకు సూచనలు చేశారు. డీసీపీ వికాస్‌తో పాటు ఆర్‌అండ్‌బీ, ఎన్పీడీసీఎల్, డీటీసీపీఓ, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బండి పక్కకు తీయాలని కోరినందుకు దాడి

కొణిజర్ల: షాపునకు అడ్డంగా ఉన్న పూల బండిని పక్కకు తీయాలని కోరినందుకు తగాదా పెట్టుకోవడమే కాక కత్తితో దాడి చేశాడని మండలంలోని తనికెళ్లకు చెందిన కావేటి రామకృష్ణ - ఉదయలక్ష్మి దంపతులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనికెళ్లలోని తుమ్మలపల్లి రోడ్డులో రామకృష్ణ దంపతులు స్వీట్ షాపు, కొబ్బరి బోండాల వ్యాపారం చేస్తుండగా, వీరి షాప్‌నకు ఎదురుగా రోడ్డు పక్కనే నాలుగు చక్రాల బండిపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి పూల వ్యాపారం చేస్తున్నాడు. అయితే, బండిని తమ దుకాణం ఎదురుగా పెట్టడం వల్ల వ్యాపారం తగ్గుతోందని రామకృష్ణ చెప్పగా సదరు వ్యక్తి వీరితో గొడవ పడి గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధి కోటేశ్వరరావు తెలిపాడు. ఈమేరకు ఆయన రామకృష్ణతో గొడవకు దిగి కత్తితో దాడి చేయబోయాడు. అడ్డుపడిన ఉదయలక్ష్మి చేతికి కత్తి తగిలి వేలు తెగింది. ఈమేరకు సదరు నేతతో ప్రాణభయం ఉందంటూ రామకృష్ణ దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేసుల పేరిట హడలెత్తిస్తున్న సైబర్ నేరగాళ్లు

ఖమ్మంఅర్బన్: ఉద్యోగ, విద్యా అవసరాల కోసం విదేశాలకు వెళ్లిన విద్యార్థులే లక్ష్యంగా సైబర్ మోసగాళ్లు వేస్తున్న ఎత్తుగడలు తల్లిదండ్రులను హడలెత్తిస్తున్నాయి. విదేశాల్లో డ్రగ్స్, లైంగిక దాడి కేసుల్లో ఇరుక్కున్నారని భయపెట్టి డబ్బు దండుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తోంది. కొందరు తల్లిదండ్రులు భయపడి డబ్బు చెల్లించి ఆతర్వాత మోసపోయామని తెలిసి పోలీసులను ఆశ్రయిస్తున్నారు. వైరా మండలానికి చెందిన ఓ రైతు ఖమ్మంలో నివాసం ఉంటుండగా ఆయన కమారుడు ఉన్నత చదువుల కోసం ఏడాది క్రితం అమెరికా వెళ్లాడు. ఈమేరకు సదరు రైతుకు ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు ఆయన కుమారుడు కేసులో ఇరుక్కున్నాడని, తాము చెప్పిన నంబర్‌కు డబ్బులు జమ చేస్తే బయటపడేస్తామని తెలిపారు. అయితే, వారి భాష అర్థం కాక రైతు ఫోన్ కట్ చేస్తుండగా పదేపదే ఫోన్ చేశారు. దీంతో సదరు రైతు తన కుమారుడికి ఫోన్ చేస్తే అక్కడ రాత్రివేళ కావడంతో స్పందించలేదు. సమీపంలో నివాసముండే వారికి ఫోన్ చేసి పంపించగా ఎలాంటి కేసులు లేవని తేలడంతో ఆయన ఊపిరి పీల్చుకున్నాడు. ఇలాగే పలువురికి ఫోన్లు వస్తున్నందున పోలీసులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గడ్డి మందు తాగి మహిళ ఆత్మహత్య

ఖమ్మంరూరల్: మానసిక వ్యాధితో బాధపడుతున్న మహిళ గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మండలంలోని ముత్తగూడెంకు చెందిన బాగం వాణి(55) కొన్నాళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతుండగా చికిత్స చేయిస్తున్నారు. ఈక్రమంలోనే 2వ తేదీన ఆమె ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగి వాంతులు చేసుకుంటుండడంతో ఖమ్మంకు, అక్కడి నుంచి హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఘటనపై ఆమె కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు...


నాగప్రణీత్ (ఫైల్)

ముదిగొండ: ముదిగొండకు చెందిన ఉప్పు నాగప్రణీత్ (23) డిగ్రీ పూర్తి చేసి రెండేళ్లుగా ఉద్యోగాల కోసం శిక్షణ తీసుకుంటున్నాడు. అయినా ఉద్యోగం సాధించలేక పోయాననే ఆవేదనతో గతనెల 28న ఇంటిలోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి బిగించుకోగా గమనించిన కుటుంబీకులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఆయన తండ్రి భాస్కర్‌రావు ఫిర్యాదుతో పోలీసుల కేసు నమోదు చేశారు.

మూడు కుటుంబాలకు తపాలా బీమా


బీమా చెక్కు అందిస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి

ఖమ్మంగాంధీచౌక్: తపాలా శాఖ నిర్వహిస్తున్న ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన(పీఎంజేజేబీవై) పథకం ద్వారా మూడు కుటుంబాలకు బీమా పరిహారం చెల్లించారు. ఏటా రూ.436 ప్రీమియం చెల్లిస్తూ మరణించిన ముగ్గురి కుటుంబాలకు శుక్రవారం ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి రూ.2 లక్షల చొప్పున చెక్కులు అందజేశారు. తల్లంపాడు సబ్ పోస్టాఫీస్ పరిధిలో బీమాలో చేరి మరణించిన వారి నామినీలు వి.వినోద, ఏ.శైలజ, కె.పద్మకు ఆయన చెక్కులు అందజేసి మాట్లాడారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని తపాలా శాఖ ద్వారా అమలు చేస్తున్న వినియోగించుకోవాలని కోరారు. తల్లంపాడు సబ్ పోస్టుమాస్టర్ ఎస్.సాయిబాబా, పంచాయితీ కార్యదర్శి బుచ్చన్న పాల్గొన్నారు.

జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక


పురుషుల హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు


మహిళల జట్టు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికకు పోటీలు నిర్వహించారు. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన పోటీల్లో జిల్లాస్థాయి సీనియర్ హ్యాండ్‌బాల్ జట్లను ఎంపిక చేయగా 30మంది పురుషులు, 25మంది మహిళలు హాజరయ్యారు. ఇక్కడ ఎంపిక చేసిన జిల్లా జట్లు ఈనెల 9నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోట్ల శ్రీకాంత్, డాక్టర్ పి.రఘునందన్ తెలిపారు. కాగా, ఎంపికల ప్రక్రియను కృష్ణయ్య, శ్రీనివాస్ పర్యవేక్షించారు. జిల్లా పురుషుల జట్టుకు గౌతమ్, జగదీష్, వెంకటేష్, రామంజనేయులు, నగేష్, కరుణాకర్, అజయ్, తిరుపతి, భద్ర, రవికిరణ్, సాయితేజ, ఉపేంద్ర, నివాస్, రవికుమార్, రామారావు, శ్రీకాంత్ ఎంపిక కాగా, మహిళా జట్టులో బి.నందిని, ఉషాశ్రీ, సమైక్య, ఎస్.నందిని, మీనాక్షి, అశ్వినీ, సాయిప్రసన్న, సింధు, సౌమ్య, వి.సంధ్య, నాగేంద్రకుమారి, శ్రీలత, కృష్ణశ్రీ, సంధ్య, అర్చనకు చోటు దక్కిందని తెలిపారు.

ఇజ్రాయిల్ తీరుపై ఈనెల 7న నిరసనలు

ఖమ్మంమయూరిసెంటర్: పాలస్తీనాలోని గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమం, నరమేధాన్ని తక్షణమే నిలిపివేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఈ మేరకు 7వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు చేపట్టాలని అన్ని వామపక్షాలు నిర్ణయించాయని తెలిపారు. ఈ ప్రదర్శనల్లో ప్రజాస్వామికవాదులు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఖమ్మం సుందరయ్య భవనంలో శుక్రవారం జరిగిన సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గాజాపై ఇజ్రాయిల్ యుద్ధం ప్రారంభించి ఏడాది కావొస్తుండగా 50 వేల మందికి పైగా ప్రజలు మరణించారని, ఇందులో పిల్లలు, మహిళలు ఉన్నారని తెలిపారు. అమెరికా, పశ్చిమదేశాల అండతో ఇజ్రాయిల్ నరమేధానికి తెగబడుతోందని, ప్రధాని మోదీ దేశ విదేశాంగ విధానానికి భిన్నంగా ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి పరోక్ష సహకారం ఇవ్వడాన్ని ప్రజలు ఆమోదించరని చెప్పారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ వంద రోజుల్లో అమలు చేస్తామన్న ఆరు గ్యారంటీలు నెరవేరలేదని, వీటి అమలుకోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నాయకులు యర్రా శ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వరరావు, మాచర్ల భారతి, కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేష్, బుగ్గవీటి సరళ, భూక్యా వీరభద్రం, వై.విక్రం, చింతలచెర్వు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.